క్లుప్తంగా

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన



విగ్రహాలకు పూజలు చేస్తున్న గ్రామస్తులు

రాయదుర్గంటౌన్‌:మండలంలోని చదం గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆంజనేయ స్వామి ఆలయ ఆవరణలో మహాగణపతి సమేత సీతారామ, లక్ష్మణ ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన మంగళవారం జరిగింది. బుధవారం కూడా పూజలు జరుగుతాయని గ్రామపెద్దలు తెలిపారు.

17న సేవ్‌ ఆర్డీటీ బైక్‌ ర్యాలీ



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

బ్రహ్మసముద్రం : వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో మాజీ ఎంపీ, కళ్యాణదుర్గం సమన్వయకర్త తలారి రంగయ్య నేతృత్వంలో ఈనెల 17న జరిగే 'సేవ్‌ ఆర్డీటీ బైక్‌ ర్యాలీ'ని విజయవంతం చేద్దామని పార్టీ మండల కన్వీనర్‌ పాలబండ్ల చంద్రశేఖర్‌ రెడ్డి , జిల్లా ఉపాధ్యక్షుడు గంగాధరప్ప పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని పలువురు నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. వెనుకబడిన జిల్లాలో ఎన్నో రకాలుగా ఆర్డీటీ సేవలందిస్తోందన్నారు. ఆర్డీటీ ఎఫ్‌సీఆర్‌ఏను రెన్యూవల్‌ చేయకపోవడం సరికాదన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కంభం చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ మహదేవప్ప, జిల్లా పంచాయతీ రాజ్‌ విభాగం కార్యదర్శులు గోపాలరెడ్డి, మంజునాథ, వడ్డే వెంకటేశులు, బాధ పల్లప్ప, శివన్న, తలారి గోవిందప్ప, తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



జెడ్పీటీసీ రాధాస్వామిని పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కళ్యాణదుర్గం రూరల్‌: ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి బెంగళూరులో చికిత్స పొందుతూ కరిగానిపల్లికి చేరుకున్న కుందుర్పి జెడ్పీటీసీ రాధాస్వామిని వైఎస్సార్‌సీపీ నాయకులు మంగళవారం పరామర్శించారు. కార్యక్రమంలో కళ్యాణదుర్గం జెడ్పీటీసీ బొమ్మన్న, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ములకనూరు తిమ్మరాయుడు, సీబీ సెల్‌ జిల్లా ప్రధాన కార్యదర్శి కామక్కపల్లి మల్లి, జిల్లా ప్రచార విభాగ ప్రధాన కార్యదర్శి కొండాపురం నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.


రీసర్వేతో భూసమస్యల పరిష్కారం



కూడేరు: మాట్లాడుతున్న రీసర్వే డీటీ ప్రసాద్‌

కూడేరు: రీసర్వేతో భూ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని రీసర్వే డిప్యూటీ తహసీల్దార్‌ ప్రసాద్‌ తెలిపారు. మంగళవారం మండలంలోని కొర్రకోడులో రీసర్వేపై గ్రామసభ నిర్వహించారు. డీటీ ప్రసాద్‌ మాట్లాడుతూ భూసరిహద్దుల్లో రైతుల మధ్య సర్దుబాటు ఉంటేనే సర్వే చేసి హద్దులు ఏర్పరచడానికి వీలుంటుందన్నారు. కార్యక్రమంలో మండల సర్వేయర్‌ ఆయేషా సిద్దికీ , వీఆర్వో, గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.

హంస వాహనంపై నృసింహుడి వైభవం



హంస వాహనంపై లక్ష్మీనృసింహుడు

ఉరవకొండ రూరల్‌: పెన్నహోబిలం లక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం హంస వాహనంపై శ్రీవారు కటాక్షించారు. ఉదయం స్వామికి విశేష పూజలు నిర్వహించిన అనంతరం శ్రీదేవి, భూదేవి సమేతంగా హంస వాహనంపై కొలువు తీర్చి ఆలయ పురవీధుల్లో ఊరేగించారు. ఈఓ రమేష్‌ బాబు, ప్రధాన అర్చకులు ద్వారకానాథచార్యులు, బాలాజీ స్వామి, ఉత్సవ ఉభయదాతలు పాల్గొన్నారు.

రోడ్లపైనే పంట నూర్పిడి

గుమ్మఘట్ట: భూపసముద్రం రోడ్డు, బీటీపీ రోడ్డు, కోనాపురం రోడ్డు, రంగసముద్రం రోడ్ల మార్గంలో మొక్కజొన్నలు ఆరబెట్టడంతో ద్విచక్ర వాహనదారులు, ఇతర వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. భూపసముద్రం రోడ్డులో ఇద్దరు, కోనాపురం రోడ్డులో ఇద్దరు రోడ్డు ప్రమాదాల్లో గాయపడ్డారు.

ఏబీ స్విచ్‌లు ఏవీ?



రాయదుర్గంలోని గాడలేబెట్‌లో ఏబీ స్విచ్‌లు లేని ట్రాన్స్‌ఫార్మర్లు

కణేకల్లు రోడ్డులోని ప్రధాన రహదారిలో ఏబీస్విచ్‌ లేని ట్రాన్స్‌ఫార్మర్‌

- ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద కనిపించని ఏబీ స్విచ్‌లు
- ఎయిర్‌ బ్రేక్‌లు లేక విద్యుత్‌ సరఫరా ఆపలేక అవస్థలు
- ప్రాణాలు కోల్పోతున్న రైతులు, ప్రజలు

రాయదుర్గం: విద్యుత్‌ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఏబీ స్విచ్‌లు (ఎయిర్‌ బ్రేక్‌) లేక ప్రజలు అవస్థలు పడుతున్నారు. ప్రతి ట్రాన్స్‌ఫార్మర్‌ వద్ద తప్పక ఏబీ స్విచ్‌లు ఏర్పాటు చేయాలనే నిబంధన ఉన్నా పూర్తి స్థాయిలో అమలు కావడంలేదు. ఏబీ స్విచ్‌లు ఏర్పాటు చేయాలని ప్రజల నుంచి వినతులు అందుతున్నా కూటమి ప్రభుత్వం పట్టించుకోలేదని రైతులు, ప్రజలు అంటున్నారు. విద్యుత్‌ సరఫరాలో సమస్య తలెత్తినప్పుడు సబ్‌స్టేషన్‌ సిబ్బందిని ఆశ్రయించి ఎల్‌సీ తీసుకోవాల్సిన పరిస్థితి వస్తోంది. దీంతో రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లోని ప్రజలు విద్యుత్‌ ప్రమాదాల బారిన పడి, మృత్యుఒడికి చేరుతున్నారు. ఇటీవల అనేక ఘటనలు వెలుగుచూడటమే ఇందుకు నిదర్శనం. రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ విద్యుత్‌ సబ్‌ డివిజన్‌ పరిధిలోని 76,410 వ్యవసాయం, 1,81,364 గృహాలు, పరిశ్రమలకు చెందిన విద్యుత్‌ కనెక్షన్లు ఉన్నాయి. వీటన్నింటికీ 33/11 కేవీ నుంచి 59 సబ్‌స్టేషన్ల ద్వారా విద్యుత్‌ సరఫరా జరుగుతోంది. ఆయా ఫీడర్ల పరిధిలో వేలాదిగా ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో సింగిల్‌ ఫేజ్‌ విధానం అమలులో ఉండడంతో ఏబీ స్విచ్‌లు పెద్దగా అవసరం ఉండదు. రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ పట్టణాల్లో సుమారు 350కు పైగా ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి విద్యుత్‌ సరఫరా జరుగుతోంది. ఇందులో 70 శాతం ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఏబీ స్విచ్‌లు కనిపించవు. అత్యవసర పరిస్థితుల్లో కరెంటు సరఫరా ఆపడం సాధ్యం కావడం లేదు. చాలాచోట్ల పాడైపోయినా వాటిని బాగు చేయక నిరుపయోగంగా వదిలేశారు.

ప్రతిపాదనలు పంపాం

పట్టణాల్లో పాడైపోయిన ఏబీ స్విచ్‌ల స్థానాల్లో మరమ్మతులు లేదా కొత్త వాటి ఏర్పాటుకు కృషి చేస్తాం. అందుబాటులో ఉన్న బడ్జెట్‌తోనే ఈ సమస్యకు పరిష్కారం చూపేలా సిబ్బందికి ఆదేశాలిస్తాం. సాధ్యమైనంత వరకూ విద్యుత్‌ పై సొంతంగా ప్రయోగాలు చేసే పద్ధతి ప్రమాదకరం. సమస్య ఏదైనా సరే విద్యుత్‌ అధికారుల దృష్టికి తీసుకురావాలి. తద్వారా ప్రమాదాలు జరిగేందుకు ఆస్కారం ఉండదు. ప్రజలు ఈ విషయాన్ని గమనించాలి.

– రాజశేఖర్‌, విద్యుత్‌శాఖ ఈఈ, కళ్యాణదుర్గం

ఏబీ స్విచ్‌లు లేకపోతే జరిగే ప్రమాదాలు..

- ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఏబీ స్విచ్‌లు లేక ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.
- ట్రాన్స్‌ఫార్మర్‌ వద్ద లేదా, ఇళ్లల్లో ఏ చిన్న విద్యుత్‌ సమస్య ఎదురైనా ఎల్‌సీ కోసం సబ్‌స్టేషన్‌కు ఫోన్‌ చేయాల్సి వస్తోంది.



- ఏబీ స్విచ్‌లు ఉంటే ఆ పరిధిలో మాత్రమే విద్యుత్‌ సరఫరా నిలిపి, పనులు చేసుకోవచ్చు.
- ఈ అవసరాన్ని గుర్తించి సత్వరం ఏర్పాటుకు కృషి చేస్తే ప్రయోజనం ఉంటుంది.

వీధి విక్రయదారులను గుర్తించండి

కళ్యాణదుర్గం రూరల్‌: వీధి విక్రయదారులను గుర్తించాలని మున్సిపల్‌ కమిషనర్‌ వంశీ సంబంధిత అధికారులకు సూచించారు. మంగళవారం పట్టణంలోని మున్సిపల్‌ కార్యాలయంలో సచివాయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్‌ మాట్లాడుతూ ప్రతి కుటుంబంలో ఒకరు వ్యాపారవేత్తగా ఎదగాలని ప్రభుత్వం కాంక్షిస్తోందన్నారు. పట్టణంలో పేదరిక నిర్మూలన కోసం వాక్‌ టు వర్క్‌ కార్యక్రమంలో భాగంగా వీధి విక్రయదారులను గుర్తించాలని సచివాలయ సిబ్బందికి సూచించారు. వీధి విక్రయదారులను గుర్తించిన తర్వాత వారికి ఐడీ కార్డుతోపాటు వెండింగ్‌ సర్టిఫికెట్స్‌ అర్హులకు అందజేసి, వారి వ్యాపారం అభివృద్ధికి ప్రభుత్వం దోహద పడుతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్‌, మెప్మా సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

13 మంది పేకాటరాయుళ్ల అరెస్ట్‌



పట్టుబడిన పేకాటరాయుళ్లను చూపుతున్న ఎస్‌ఐ నరేంద్రకుమార్‌

బ్రహ్మసముద్రం : మండల పరిధిలోని పొబ్బర్లపల్లి శివారులో పేకాట స్థావరంపై పోలీసులు మంగళవారం దాడి చేశారు. ఎస్‌ఐ నరేంద్ర కుమార్‌ మాట్లాడుతూ అనంతపురం స్పెషల్‌ పార్టీ సిబ్బంది సమాచారం మేరకు పేకాట స్థావరంపై దాడి చేశామని, దాడుల్లో 13 మంది పేకాటరాయుళ్లను పట్టుబడినట్లు తెలిపారు. వారి నుంచి రూ.3,22,990 నగదు, 9 ద్విచక్రవాహనాలు, 11 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

శాంతిధామం..కల్లుహోళ

- మతసామరస్యానికి ప్రతీక షాబాజ్‌ దివాన్‌ వలీ ఉరుసు
- నేటి నుంచి ఉత్సవాలు ప్రారంభం



షాబాజ్‌ దివాన్‌ వలీ సమాధి



స్వామి వారు ఏర్పాటు చేసిన చెలిమ

బొమ్మనహాళ్‌: మతసామరస్యానికి ప్రతీక అయిన షాబాజ్‌ దివాన్‌ వలీ ఉరుసు ఉత్సవాలు ఈనెల 14 నుంచి ప్రారంభం కానున్నాయి. మండలంలోని కల్లుహోళ గ్రామంలో జరగనున్న ఉరుసుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కార్యనిర్వాహకులు తెలిపారు. హిందూ ముస్లింల ఐక్యతకు ప్రతీక అయిన షాబాజ్‌ దివాన్‌ వలీ ఉరుసు ఉత్సవాలు ఏటా ఆనవాయితీగా చాంద్రమాసం ప్రకారం నిర్వహిస్తున్నారు. షాబాజ్‌ దివాన్‌ వలీ ఉరుసు ఉత్సవాల్లో భాగంగా 14న గంధం, 15న దీపారాధన, 16న ఉరుసు, 17న జియారత్‌ ఉంటుందన్నారు. 17న తెల్లవారుజామున 3 గంటలకు షంషేరు దర్గా నుంచి పీఠాధిపతుల ఆధ్వర్యంలో ఊరేగింపు ఉంటుంది.

స్వామివారి చరిత్ర ఇదీ :

బొమ్మనహాళ్‌ మండలంలోని కల్లుహోళ గ్రామం వద్ద ఉన్న ఇసుక దిబ్బలపై షాబాజ్‌ దివాన్‌ వలీ దీక్షలో కూర్చునేవారు. ముస్లింలకు మహమ్మద్‌ ప్రవక్త బోధనలు తెలుపుతూ ప్రజల్లో శాంతి సామరస్యాలు నెలకొల్పేవారు. స్వామివారి వద్దకు వెళ్లిన ప్రజలు, భక్తులకు సూక్తులు, హిత బోధలు, రోగాలు నయం చేయడం, ఇతర వ్యాపకాలను దూరం చేయడం, వారి బాధలను తగ్గించడం లాంటివి చేస్తుండేవారు. ఇదే సమయంలో బళ్లారి కోట నుంచి పెనుకొండ కోటకు రాయలవారి సైన్యం, వాహనాలు, రథాలు, ఏనుగులు, ఒంటెలు, గుర్రాలతో పాటు సైనికులు వెళ్తుండగా దాహం వేసింది. సైన్యాధిపతులు నీటి కోసం వెతుకుతూ స్వామి వారిని అర్థించారు. అప్పుడు సైన్యాధిపతిని గుర్రంలోఒక వైపు వెళ్లాల్సిందిగా స్వామి ఆదేశించారు. ఎక్కడైతే గుర్రం డెక్క దిగబడుతుందో అక్కడ తవ్వాలని సూచించారు. గుర్రంపై వెళ్తున్న సైన్యాధిపతి గుర్రం డెక్క ఒక చోట దిగబడటంతో సైనికులతో చెలిమ తవ్వించారు. అప్పుడు నీరు ఉబికి వచ్చింది. దీంతో సైనికులు, ఏనుగులు, గుర్రాలు, ఒంటెల దాహం తీర్చుకున్నారు. అప్పటి నుంచి చెలిమ ఇప్పటివరకు అలాగే ఉంది. రోజూ ఆ నీటినే ప్రజలు తీసుకొని వెళ్తున్నారు. చుట్టూ కిలోమీటరు దూరం లోపు ఎక్కడ బోరుబావులు తవ్వినా నీరు పడడంలేదని రైతులు చెప్తున్నారు. ఇది స్వామివారి మహత్యమని రైతులు, భక్తులు చెలిమ నుంచి సీసాలు, బాటిళ్ల ద్వారా నీరు తీసుకెళ్తున్నారు.

కల్లుహోళలో సమాధి :

అనేక ఇసుక దిబ్బలపైనే దీక్ష చేస్తున్న స్వామివారిని ముస్లింలు, గ్రామస్తులు గ్రామంలోకి ఆహ్వానించారు. గ్రామంలోనే ఉండి ప్రజల సుఖశాంతులు కోరుతూ శాంతిబోధనలు చేయాలని కోరడంతో స్వామివారు కల్లుహోళలో జీవనం సాగించారు. అనంతరం ప్రజల్లో శాంతి సామరస్యాలు నెలకొల్పుతూ, భక్తి ప్రవచనాలు, ప్రబోధాలు చేస్తూ పరమపదించారు. అప్పటి నుంచి స్వామివారి గుర్తుగా ఉరుసు మహోత్సవాన్ని ఏటా భక్తులు నిర్వహించుకుంటున్నారు.

ప్రజా సమస్యలపై అధికారుల నిర్లక్ష్యం తగదు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ కంభం చంద్రశేఖర్‌ రెడ్డి

బ్రహ్మసముద్రం : ప్రజా సమస్యలు పరిష్కారంలో అధికారుల నిర్లక్ష్యం సరికాదని ఎంపీపీ కంభం చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మండలంలోని పలువురు ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు హాజరై సమస్యలను సమావేశం దృష్టికి తెచ్చారు. ఎంఈఓ–2 కృష్ణనాయక్‌ మాట్లాడుతూ మండలంలో పదో తరగతిలో ఈ ఏడాది 53 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. భైరవాని తిప్ప పంచాయతీ సర్పంచ్‌ మంజునాథ మాట్లాడుతూ మండలంలోని 470 మందికి గాను 250 మంది మాత్రమే పదోతరగతిలో ఉత్తీర్ణులయ్యారని, ఇది కేవలం విద్యాధికారుల నిర్లక్ష్యానికి ఫలితమేనన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో సిబ్బంది నిర్లక్ష్యంగా ఉన్నారని, మండలంలో పలు గ్రామాల్లో విద్యుత్‌ సమస్యలున్నాయని, పారిశుద్ధ్యం మెరుగుపడలేదని, నీటి సమస్య ఉందని సభ దృష్టికి తెచ్చారు. కార్యక్రమంలో వైస్‌ ఎంపీపీలు వెంకటేష్‌నాయక్‌, సునందమ్మ, ఎంపీటీసీలు నాగలక్ష్మి, వరలక్ష్మి, ఖుసప్ప, సువర్ణమ్మ, తిప్పేస్వామి, నరసింహా, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు శెట్టాగారి మంజునాథ, సర్పంచులు ఆదినారాయణ రెడ్డి, గోవిందప్ప, ఏఓ నందకిశోర్‌, ఈఓఆర్డీ రంగనాయకులు , మండల వైద్యాధికారి రాజేష్‌, ఆర్‌డబ్ల్యూఎస్‌ ఏఈ సుబ్బరాయుడు, పశువైద్యాధికారి నవీన్‌ , ఐసీడీఎస్‌ సూపర్‌వైజర్లు ఖాసీంబీ, రామాంజనమ్మ, ఏపీఓ రవిచంద్రరాజు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువతి మృతి



మౌనిక

బొమ్మగుప్ప: మండల కేంద్రంలోని అంబేడ్కర్‌ కాలనీకి చెందిన మౌనిక (28) బెంగళూరులోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. మృతురాలి తండ్రి వన్నూరస్వామి తెలిపిన మేరకు.. మౌనిక అనంతపురంలో అద్దె రూంలో ఉంటూ ఓ వైపు డీఎస్సీకి సన్నద్ధమవుతూనే హిందూపురంలోని ఓ ప్రైవేట్‌ కంపెనీలో పని చేస్తోంది. గత నెల 29న బస్సు ఎక్కే సమయంలో అదుపుతప్పి పడిపోయింది. ఈ ప్రమాదంలో తలకు బలమైన గాయమై, అపస్మారక స్థితిలోకి వెళ్లింది. ఆమెను మెరుగైన చికిత్స నిమిత్తం బెంగళూరుకు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందింది. ఉన్నతంగా చదివిన మౌనిక.. కుటుంబానికి చేదోడు వాదోడుగా ఉన్న సమయంలో ఇలా ప్రమాద వశాత్తూ కిందపడి మృతిచెందడంతో కుటుంబ సభ్యులు విలపించారు. కిమెయిల్‌ కంపెనీ యాజమాన్యం ఆదుకోవాలని యువతి తల్లిదండ్రులు దుర్గమ్మ, వన్నూరస్వామి కోరుతున్నారు.

పనిచేయని సర్వర్‌.. జనం బేజార్‌



సచివాలయంలో రేషన్‌కార్డు కోసం దరఖాస్తులు ఇస్తున్న అర్జీదారులు



సచివాలయం వద్ద పడిగాపులు కాస్తున్న దృశ్యం

రాయదుర్గంటౌన్‌: సచివాలయాల్లో రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు ప్రక్రియలో సర్వర్‌ సతాయిస్తుండడంతో జనం బేజారవుతున్నారు. నాలుగు రోజుల నుంచి సర్వర్‌ పనిచేయడంలేదు. రెండు రోజుల నుంచి వెబ్‌సైట్‌ ఓపెన్‌ అవుతున్నా దరఖాస్తు పూర్తి చేసి నమోదు చేయాలంటే ఎర్రర్‌ మేసేజ్‌ వచ్చి కట్‌ అవుతోందని, సబ్‌మిట్‌ కాకపోవడంతో సచివాలయ డిజిటల్‌ అసిస్టెంట్లు విసిగిపోతున్నారు. దీంతో కొత్త రేషన్‌ కార్డులు, సభ్యుల చేరిక, కార్డులో సభ్యుల స్ప్లిట్‌ ఆప్షన్‌ కోసం వచ్చి కార్డుదారులు నిరాశతో వెనుదిరుగుతున్నారు. మరికొందరు దరఖాస్తుల కోసం రోజూ సచివాలయాల వద్దకు ప్రదక్షిణలు చేయాల్సి వస్తోంది. కాగా పట్టణంలోని 18 సచివాలయాల పరిధిలో ఇప్పటి దాకా కేవలం 80 దరఖాస్తులు మాత్రమే నమోదైనట్లు రికార్డులు చెబుతున్నాయి. కొన్ని సచివాలయాల్లో ఒక్క దరఖాస్తు కూడా నేటి వరకు నమోదు కాకపోవడం విశేషం. దీనిపై తహసీల్దార్‌ నాగరాజును అడగ్గా సచివాలయ ఉద్యోగులు సమస్యను తమ దృష్టికి తీసుకురాలేదన్నారు. సాంకేతిక సమస్య ఉంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

శెట్టూరు: మండలంలోని ప్రైవేట్‌ పాఠశాలల్లో ఒకటోతరగతిలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని ఎంఈఓ శ్రీధర్‌ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓబీసీలైన నిరుపేద విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. పాఠశాలలున్న చోట నుంచి కిలో మీటరు నుంచి మూడు కిలోమీటర్ల పరిధిలో ఉన్న విద్యార్థులు అర్హులన్నారు. ఈ నెల 15 తేదీలోపు ఆన్‌లైన్‌ దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. మరిన్ని వివరాలకు సెల్‌: 9440699404లో సంప్రదించాలని తెలిపారు.

బాల్య వివాహాలతో అనేక అనర్థాలు



బాల్యవివాహాల నివారణపై అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ శ్రీదేవి

ఉరవకొండ రూరల్‌: బాల్య వివాహాలతో అనేక అనర్థాలు జరుగుతాయని సీడీపీఓ శ్రీదేవి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని రాకెట్ల అంగన్‌వాడీ సెంటర్‌లో ప్రాజెక్టర్‌ ద్వారా అమ్మాయిలకు బాల్య వివాహాలతపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా సీడీపీఓ శ్రీదేవి మాట్లాడుతూ కిశోరి బాలికలు పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. ఇంట్లో ప్రతి అమ్మాయికి చదువులు చెప్పించాలని, అప్పుడే వారి భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఏసీడీపీఓ ఎల్లమ్మ, సూపర్‌వైజర్‌ రాబియా, ఎంఎస్‌కే రామాంజనమ్మ, ఏఎన్‌ఎం పద్మావతి, అంగన్‌వాడీ కార్యకర్తలు రాజమ్మ, అన్నపూర్ణ, జయమ్మ, చంద్రకాంత, సుజమ్మలు పాల్గొన్నారు.

ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలి



మాట్లాడుతున్న కౌలు రైతుల సంఘం జిల్లా నాయకులు

ఉరవకొండ రూరల్‌: నియోజకవర్గంలో వారం రోజుల వ్యవధిలోనే నలుగురు కౌలు రైతులు అప్పుల బాధ తాళలేక ఆత్మహత్య చేసుకున్నారని, బాధిత కుటుంబాలకు రూ. 20 లక్షలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని కౌలు రైతు సంఘం జిల్లా నాయకులు డిమాండ్‌ చేశారు. మంగళవారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహం వద్ద కౌలు రైతు సంఘం జిల్లా నాయకులు పెద్ద ముష్టూరు వెంకటేష్‌ విలేకరులతో మాట్లాడారు. విడపనకల్లు మండలం పాల్తూరుకు చెందిన కౌలు రైతు సుధాకర్‌, పెద్దకొట్టాలపల్లికి చెందిన హరిజన రాముడు, ఉరవకొండ మండలం ఆమిద్యాలకు చెందిన హరిజన ఎర్రిస్వామి, వజ్రకరూరు మండలం వెంకటాంపల్లి పెద్దతండాకు చెందిన సోమ్లానాయక్‌ పంట దిగుబడి రాక అప్పులు తీర్చలేక ఆత్మహత్యలు చేసుకున్నారన్నారు. గతంలో ఎన్నడు లేని విధంగా కూటమి ప్రభుత్వంలో రైతుల ఆత్మహత్యలు అధికమయ్యాయన్నారు. కార్యక్రమంలో కౌలు రైతు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు సుంకన్న, సురేష్‌, రామ్మూర్తి, అశ్వర్థనారాయణ, ఓబయ్య, ప్రసాద్‌ పాల్గొన్నారు.

ఫైలేరియా వ్యాధి నిర్ధారణ పరీక్షలు



చిన్నముష్టూరులో రక్త పరీక్షలు చేస్తున్న రాకెట్ల పీహెచ్‌సీ వైద్య సిబ్బంది

ఉరవకొండ రూరల్‌: మండల పరిధిలోని చిన్న ముష్టూరులో ఫైలేరియా వ్యాధి నిర్ధారణ పరీక్షలు మంగళవారం నిర్వహించారు. రాకెట్ల పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్‌ పావని ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి వైద్య సిబ్బంది రక్త నమూనాలు సేకరించారు. అనంతరం ప్రతి ఒక్కరికీ కరపత్రాలు అందించి దోమల నివారణకు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో తెలియజేశారు. వైద్యాధికారిణి, గ్రామ కార్యదర్శి రమణ, మలేరియా సబ్‌ యూనిట్‌ అధికారి భక్తుల కోదండరామి రెడ్డి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ఇంటి ఆవరణను శుభ్రంగా ఉంచుకోవాలని, దోమలు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. దోమల బారి నుంచి దోమతెరలు వాడాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్‌ శేఖర్‌, ఏఎన్‌ఎం పద్మావతి, చాముండేశ్వరీ, అనూష, హేమలత తదితరులు పాల్గొన్నారు.

నిలువునా చీలుస్తున్నా.. చెట్టంత నిర్లక్ష్యం



కూడేరు ఎంపీడీఓ కార్యాలయ భవనంపై పెరిగిన చెట్టు... నెర్రెలు చీలిన గోడ

కూడేరు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయం భవనంపైన వెనుక వైపు రావి చెట్టు మానవుతోంది. దాని వేర్లు కార్యాలయ భవనం గోడలోకి చొచ్చుకొని వెళ్తోంది. దీంతో గోడలు చీలిపోయాయి. కార్యాలయ గదులు కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. అయినా అధికారులు మాత్రం దీనిపై ఏమాత్రం పట్టించుకోలేదని కార్యాలయానికి వచ్చే ప్రజలు,ప్రజాప్రతినిధులు అంటున్నారు.

ప్రమాదకరంగా వాల్వ్‌ గుంత



పోలీస్‌ స్టేషన్‌ వద్ద రహదారి మధ్యలో ప్రమాదకరంగా ఉన్న వాల్వ్‌ గుంత

ఉరవకొండ: ఉరవకొండ పోలీస్‌ స్టేషన్‌ పక్కనే ప్రధాన రహదారి మధ్యలో ఉన్న వాల్వ్‌ గుంత ప్రమాదకరంగా మారింది. పీఏబీఆర్‌ నుంచి వచ్చే తాగునీటి కోసం ఆర్‌డబ్ల్యూఎస్‌ అధికారులు ఏర్పాటు చేసిన వాల్వ్‌ గుంతకు ఎలాంటి రక్షణ లేకుండా వదిలేశారు. దీంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. రాత్రి సమయాల్లో వాహనదారులకు గుంత కన్పించకుండా పోవడంతో గుంతలో పడి పలువురు గాయపడ్డారు.